# అమ్మకో యిల్లు



స్టాంప్ పేపర్స్‌వాళ్ళు, టైప్ చేసేవాళ్ళు,బాల్‌పెన్స్, టీ అమ్మేవాళ్ళు, బ్రోకర్స్, ఇ.సి. అప్లయ్ చేసేవాళ్ళు, అమ్మేవాళ్ళు, కొనేవాళ్ళు, వర్జ్యం దుర్ముహూర్తం చూసేవాళ్ళు, పార్కింగ్ వాళ్ళు- ఆ ఆవరణంతా రద్దీగా వుంది. మెరుస్తోన్న చూపులు... నిర్లిప్తమైన చూపులు... రొటీన్ చూపులు...

మానవ జీవితంలో వో ఆనందవిషాదాలకి సంబంధించిన పార్శ్వమొకటి సజీవం గా తిరుగుతున్నట్టనిపిస్తోంది.

అనేకానేక ఆస్తి లావాదేవీలు జరిగేచోట తక్కువగా కనిపిస్తున్నట్టే యిక్కడా స్త్రీలు పెద్దగా లేరు. అటూయిటూ తిరుగుతున్నవాళ్ళు, తమ వంతు రానివాళ్ళ చూపులు అక్కడున్న నలుగురైదుగురు స్త్రీల చుట్టూ తిరుగుతున్నాయి.అయితే ఆ చికాకునో, దాహాన్నో, పూర్తి రఫ్‌గా మారిపోయిన వాతావరణాన్నో, వుక్కనో పట్టించు కోలేనంత ఆనంద వుద్వేగాలు ప్రవహిస్తుంటే చేతి గడియారంవైపు చూశాను.

వస్తానన్న సమయం దాటి పదిహేను నిమిషాలు అయింది. యేమైంది... ట్రాఫిక్ జామ్... ప్చ్! త్వరగా వస్తే బాగుండు. యెప్పుడెప్పుడు పని పూర్తవుతుందా అని వొకటే ఆత్రం... ఆ కళ్ళ వెలుగు చూడాలి.

యెంతో కాలంగా ఆ కళ్ళలో తిరిగి తిరిగి గూడు కట్టుకునే దుఃఖానికి ముగింపు. యికమీదట ఆ కళ్ళల్లో సదా వెన్నెల వెలుగు. ఆ దాటి వచ్చిన అనేకానేక అను భవాలు సంతోషాన్నిచ్చాయి. వుత్సాహాన్నిచ్చాయి. వుద్వేగపూరితమైనాయి. శాంతి నిచ్చాయి. అశాంతిని కలిగించాయి. ప్రేమపూరితమైనవి, బాధామయమైనవి, జీవితపుదారుల్లా అనేకానేక అనుభవాలని చూసినా ఆ జ్ఞాపకాలు భిన్న రంగుల్లో మెరుస్తోన్న... ఆ వొక్క జ్ఞాపకం నన్ను నిరంతరం వో మెలకువలో వుంచేది. ఆ వొక్క జ్ఞాపకం నా మనసుని నిత్యం మెలిపెడుతుండేది.

యికమీదట ఆ కళ్ళల్లో రుతుహేల సంచారపు ఆకుపచ్చని వెలుగు. నాన్నగారి వుద్యోగ నిమిత్తం పల్లె నుంచి పట్టణానికి వచ్చాం. అమ్మ ఆ యింటిని చూస్తూనే 'అబ్బ యెంత వాకిలో' అంది.

గుత్తులుగుత్తులుగా పల్లెపల్లెంతా పూసిన తురాయి పూలని, మంకెన పూలని, విరబూసిన రాధామనోహరాలని, మల్లెపూలని వదిలి వచ్చిన బెంగతో ఆ యింటి చుట్టూ వున్న విశాలమైన ఆవరణని చూస్తే అమ్మకి కాస్త బాధ తగ్గినట్టుంది. యెత్తుకోమని మారాం చేస్తున్న చిన్నతమ్ముణ్ణి యెత్తుకొని నూతి గట్టు వైపు నడిచింది. నూతిలోకి తొంగిచూసి 'పోనీలే, నీళ్ళు కాస్త పైకే వున్నాయి...' మళ్ళీ మరోసారి తొంగి చూసింది. నిండైన బావిని చూస్తూ 'కాస్త పైకి వుండటం యేంటే వర్షాకాలంలో చేదతో అందుకునేట్టున్నాయి' అనుకుంటూ చేత్తో గిలకని తిప్పింది. గణగణా శబ్దం. రెండు నూనెచుక్కలు వేస్తే సరి మెత్తగా తిరుగుతుంది.

నాలుగు చెంబుల నీళ్ళు పోసుకొని పాలు పొంగించింది. పల్లెలో పిట్టల్లా రివ్వు రివ్వున ఆ కొమ్మల్లోంచి యీ పువ్వుల నుంచి ఆయా ఫలాల నుంచి సంబరంగా పెరిగిన మాకు ఆ ఫెన్సింగ్ సరిహద్దులోనే మా ఆట, పాట, మాట అనే సంగతి బోధపడగానే మా పసి హృదయాలలో యిదేం యిల్లు... మన వూరెళ్ళి పోదాం అనిపించింది. అసలే పల్లెలో అవి తిరణాళ్ళ దినాలు. ఆ వుత్సవాన్ని వదిలొచ్చి నందుకే బాధగా వుంటే యీ యిల్లు వొక్క జామిచెట్టయినా లేని ఆ యింటిని, ఆ యింటి చుట్టూ వున్న కర్రల ఫెన్సింగ్‌ని చూస్తొంటే తిరిగి మా పల్లెకి వెళ్ళిపోవా లనిపించింది. తిరిగి చిన్న తమ్ముడు గొడవ. వాణ్ణి యెత్తుకొని అటూయిటూ తిప్పుతూంటే పక్కింటి ఆవరణ కాస్త పచ్చగానే కనిపించింది. యింటి వెనుక రెండు ఎర్రగన్నేరు పూలచెట్లు కనిపించాయి.

వారంరోజుల్లో చెల్లాయిలిద్దరూ వీధిలో పిల్లలతో చెలిమి కట్టేశారు. అమ్మ నేలను చదును చేసింది. నాన్నగారు విత్తనాలు తీసుకొచ్చారు. అమ్మ కొన్ని మొక్కలని పోగేసింది.

నూతిగట్టుకి వో పక్కగా అరటి మొక్కలు వేసింది. పెరటినిండా కూరగాయల మొక్కలు. ఫెన్సింగ్‌కి దొండా, కాకర తీగెలు పాకించింది. వో పక్కంతా ఆకు కూరలు వేసింది. వో వారగా పచ్చ కనకాంబరాలు. సాయంకాలపు యెండకి పూసే చంద్రకాంతులు. రాత్రులకి పరిమళాలిచ్చే జాజిపూలు, సంపెంగలు, విర జాజులు, మాలతీ తీగెలు. తొలిజాముల వెలుగుకి విచ్చుకునే రేక మందారాలు, ముద్ద మందారాలు, యెర్ర మందారాలు, చిరుజల్లుల్లో జినియాలు, నీలగోరింట పూలు, చిరు చలిగాలులలకి వికసించే చిట్టి చామం తులు, యెర్ర చామంతులు, తెల్ల చామంతులు, ముద్దబంతులు, చిట్టిబంతులు, సీమ బంతిపూలు, తెలుపు పసుపు పర్‌పుల్, గులాబి, పచ్చ డిసెంబర్‌పూలు. కాలమంతా పలకరించే గులాబీలు, నిత్యమల్లె, నందివర్ధనం.

వంగ, బెండ, టమేటా, చిక్కుళ్ళు, ఆనపకాయలు, గుమ్మడి, బీరపూల వెలుగులో తెల్లని చిక్కుడుపూలు. చిన్న వుసిరి, జామ, వేసవి సాయంకాలాల్లో వురిమే ఆకాశం. ఆషాఢపు ఆరుద్రలు. గోరింటాకుని మెత్తగా నూరి చేతుల్లో చందమామని నింపుతూ యేరువాకని గుర్తు చేసుకొనేది. శ్రావణంలో వరి కలశంతో వరలక్ష్మిని అలంకరిస్తూ వొత్తైన వరి మడులని చెరకు తోటల్ని పనసపళ్ళ సువాసనని గుర్తు

చేస్తూ అమ్మ వానాకాలపు తడితడి పేరంటాన్ని, సెనగల కమ్మని తాళింపుని, అయ్యవారికి చాలు ఐదు వరహాలని పిల్లలకి చాలు పప్పు బెల్లాలని, పచ్చని మంచు సాయంకాలంలో దీపాలు వెలిగించి దిబ్బుదిబ్బు దీపావళి గోగు కాడల దిష్టి తీయించి, మతాబుల ఘాటు... కార్తీక దీపోత్సవం నదంతా ప్రవహిస్తుంటే హేమంతపు మంచురాత్రులలో వాకిలంతా ముగ్గులు అద్దటం, నెగడు వెలుగులో తెల్లారే ప్రాతఃకాలం బంతి, చామంతి పూరేకులపై రాత్రంతా కురిసిన మంచు బిందువులని నాలిక చివర్నుంచి కదిలిస్తుంటే అమ్మ కళ్ళలో చిర్నవ్వు. శిశిరంలో చిక్కుడుకాయలతో రథం చేయటంలో మెలకువలు నేర్పుతూ రథసప్తమి ప్రసాదం తినిపిస్తూ, అమ్మ మా నలుగురికి చైత్రపు చిగురులని, వైశాఖపు వసంత రాగాలని వినిపిస్తూ యీ విశాలమైన ఆవరణ వున్న యిల్లు మనకి అద్దెకి దొరికి వుండకపోతే యేమైపోదుమో... సొంతూరిని అమ్మావాళ్ళని, అత్తయ్యని, స్నేహితుల్ని, బంధువుల్ని వదిలి వస్తుంటే దుఃఖం వచ్చింది. ఆ పువ్వులని, ఫలాలని, ఆవుల్ని, దూడల్ని వదిలి వస్తుంటే అమ్మావాళ్ళకి దిగులేసింది. పుట్టింది, పెరిగింది, పెళ్ళయింది, అమ్మయింది అక్కడే. ఆ నేల రంగు తప్పా మరో మట్టి వాసన తెలియదు. యిక్కడికి రావటం మీ నాన్నగారికి యిష్టం. వాళ్ళందరిని వదిలేసి రావటం వల్ల దుఃఖమే తప్ప యిక్కడ వాతావరణం యెలా వుంటుందో తెలియదు కదా. తీరా యిక్కడికి వచ్చాక రెండు యెర్రగన్నేరు పూలమొక్కలు తప్ప మరే మొక్కాలేని యిల్లు, యెటు చూసినా గడ్డి తప్ప. నా దుఃఖం రెట్టింపయింది. రాధామనోహరాలు లేని వాకిలి తెలియని నాకు యీ యింటిని చూడగానే తిరిగి మనూరు వెళ్ళిపోదామని బలంగా అనిపించింది. మీ నాన్నగారేమో మహా వుత్సాహంగా ఫ్యాక్టరీ సైరన్ని ఆనందంగా వింటూ సైకిల్ యెక్కి ఝుమ్మని వెళ్ళిపోతున్నారు. ఆ వుత్సాహాన్ని తిరిగి పొలంలోకి వెళ్ళటంలో చూడలేనని నమ్మకంగా అనిపించింది. దేముని దయవల్ల యేదో యింత పెరడు, వాకిలి, నీళ్ళున్న యిల్లు దొరికింది. యేవో నాలుగు పువ్వులు, కూరలు కంటికి యింపుగా. యీపాటికి మన వూర్లో మామిడికాయలు విరివిగా వచ్చుంటాయి. కోయిలలూ వచ్చేసుంటాయి. వేసవి సెలవలకి యింటికి వెళదాం. మీ నాన్నగారికి వీలు కాకపోతే నాలుగురోజులు క్యాంటీన్‌లో తినగలరేమో కనుక్కుందాం. అదీ వీలు కాదంటే నేనుండిపోతా. మీరు మాత్రం వెళ్ళి సెలవలంతా ముంజెలు, మామిడి పళ్ళు తినండి. అమ్మమ్మతో మల్లెపూల జడ కుట్టించుకోండి. అలా చెపుతూ

చెపుతూ వుంటే మీరు చిన్న పిల్లలు యివన్నీ చెప్పి విసిగిస్తున్నానా... అనేది. అప్పటికే చిన్నచెల్లెలు వినేదో లేదో కాని అమ్మ వొడిలో తలపెట్టి మహా కులాసాగా కాళ్ళు ముడుచుకుని పడుకునేది. తమ్ముడికి యేదైనా అర్థమయ్యే అవకాశమే లేదు. వాడి దృష్టంతా సైకిల్ తొక్కటంపైనే వుండేది. అందరిలోకి పెద్దదాన్నేమో ఆ పచ్చని జ్ఞాపకాలు నాలో యింకుతుండేవి.

యేమీలేని ఆ యింటిని చూస్తుండగానే అమ్మ పూలతో, ఫలాలతో తీర్చిదిద్దటం నా లేత పసిహృదయంలో స్పష్టంగా యిమిడిన జ్ఞాపకం. అలా నాలుగేళ్ళు గడిచాయి. యింట్లో యెప్పుడూ పట్నానికి పనుల మీద వచ్చిపోయే పల్లె బంధువులు, స్నేహితులు. వొకదానికొకటిలా యింట్లో యెప్పుడూ యెవరికో వొకరికి వళ్ళు వెచ్చపడటమో, జలుబో, దగ్గో... డాక్టర్ ఫీజు యిలా ఖర్చే ఖర్చు. ఆ ఖర్చు పెరిగినంతగా నాన్నగారి జీతం పెరగటంలేదు. వో లెక్క ప్రకారమే జీతాలు పెరుగుతాయంట. యేడాదికోసారి వచ్చే బోనస్‌తో యేడాది పొడుగునా చేసిన చిన్నాచితకా అప్పులు తీర్చటం తలా వో జత బట్టలు కొనుక్కోవటం అదనంగా. పండగలకి, పుట్టినరోజులకి కొన్నుక్కన్నవి కాక. గులాబీ పువ్వులు, అరిశెలు, జిలేబీలు చేసుకోవటం. యేడాదికేడాది బట్టలు పండుగలకి కొనుక్కోవటం తగ్గింది. పల్లె నుంచి అమ్మమ్మ బియ్యం, కందిపప్పు, అటుకులు, నెయ్యి, వడియాలు, అప్పడాలు, పచ్చళ్ళూ, పసుపు, చింతపండూ, కుంకుళ్ళూ పంపిస్తూనే వుంది. అయినప్పటికి ప్రతి యేడాది పెరిగే ధరలకి వచ్చే జీతాలకి సఖ్యత కుదిరేది కాదు.

నాలుగేళ్ళలో ఆ యింటి అద్దె కట్టలేని స్థాయికి రాగానే నాన్నగారు యిల్లు ఖాళీ చేసేద్దాం అన్నారు. వూరికి కాస్త దూరంగా అప్పుడప్పుడే యిళ్ళు వస్తున్న కాలనీలో కాస్త చిన్న యిల్లు తీసుకుందాం అన్నారు.

అమ్మ కంగారు పడిపోయింది.

మరో యిల్లా... యీ యిల్లు వదిలేసా... యిన్ని మొక్కలు, యిన్ని పూలు... ప్రాణానికి ప్రాణంలా పెంచుకొన్న తోటని వదిలేసి వెళ్ళటమంటే అమ్మకి దుఃఖం వచ్చేసింది. కన్నీటికి మించిన విషాదం ఆమె కళ్ళ నిండుగా.

యీ యిల్లు ఖాళీ చేయటమా... వద్దులెండి... మీరెంత జీతం యివ్వగలిగితే అంత యివ్వండి మిగిలినది నే చూసుకుంటా, అమ్మ చెప్పింది.

నాన్నగారు అయిష్టంగానే తలూపుతూ యెలా సర్దుతావో యే ఖర్చు తగ్గిస్తావో నీ యిష్టం అన్నారు.

ఖర్చులేం తగ్గలేదు. అయినా అమ్మ మాకెప్పుడూ రుచికరమైన భోజనానికి, బట్టలకి, పుస్తకాలకి, ఫీజులకి, రిబ్బన్లకి, బొట్టుబిళ్ళలకి లోటు చేయలేదు. ఆ కష్టం యేం తెలియకుండానే పెంచింది. అమ్మ తన బంగారం కరిగించి మమ్మల్ని బంగారంలా పెంచింది.

బంగారం అయితే కరిగిపోయింది. కాని ఆ యింటి అద్దెని యెప్పుడూ తట్టుకునే మార్గం యేదీ కనిపించలేదు. యిల్లు ఖాళీ చేయక తప్పదని తేలిపోయాక వో పక్క నాన్నగారు యిల్లు వెతుకుతోంటే మరోవైపు అమ్మ యేపుగా పెరిగిన మొక్కలని పట్టరాని బెంగతో చూస్తుండేది. మాటిమాటికి ఆమె కళ్ళు చెమ్మగిల్లేవి. తడిమితడిమి మొక్కల్ని చూసుకొనేది. నడిరాత్రి మెలకువ వస్తే వీధి తలుపు తీసి కనిపిస్తే లేచి బయటికి తొంగి చూసాను.

పసుపుపచ్చని శరత్కాలపు వెన్నెలతో ముచ్చట్లాడుతున్న పసుపుపచ్చని చామంతుల చెంత అమ్మ కూర్చుని వుంది. అంత చల్లని వెన్నెల్లో ఆమె దుఃఖపు సెగ నా మనసుని దుఃఖమయం చేసింది.

సొంత యిల్లు వుంటే... సొంత యిల్లు యెందుకు లేదో... ఆ యింటి నుంచి మరో యింటికి. ఆ మరో యింటికి వెళ్ళాక కూడ అమ్మ అప్పుడప్పుడూ ఆ పాతింటి వైపు వెళ్ళి బయట నుంచి ఆ మొక్కల్ని చూసుకొని వస్తుండేది. యీ కొత్తింట్లో కాస్త ఖాళీ జాగా వుంది. అమ్మ ఆ నేలని చదును చేసి మొక్కలు వేసింది. ఆ గులాబీలని కుండీల్లో వెయి. బోల్డన్ని డబ్బులు పోసి కొనటం అలా పరాయిపాలు చేయటమెందుకని యింటికొచ్చిన పెద్దాయన అమ్మకి సలహా యిచ్చారు. అమ్మ విన్నదే తప్ప ఆ పని చేయలేదు. రెండేళ్ళకి ఆ స్థలమంతా పచ్చగా పూస్తుండగా యిల్లు ఖాళీ చెయ్యాల్సి వచ్చింది. ఆ యింటివాళ్ళ బంధువులకి యిల్లు కావల్సి వచ్చి. ఆ యింటి నుంచి మరో యిల్లు ఆ మరో యింటి నుంచి యింకో యిల్లు. ఆ యింకో యింటి నుంచి యింకొక యిల్లు... యిలా సంవత్సరానికో రెండేళ్ళకో నాలుగేళ్ళకో యిల్లు ఖాళీ చెయ్యాల్సి వచ్చినప్పుడంతా అమ్మ కళ్ళలో విషాదం... అదే విషాదం... తల్లి పిల్లలని తప్పనిసరిగా వదిలిపెట్టే పరిస్థితుల దుర్మార్గపు విషాదం. యేదో గుండెలని పట్టుకొన్న బరువు.

''యెందుకా మొక్కలు వేయటం... యిల్లు ఖాళీ చేసినప్పుడల్లా నువ్వు బాధపడటం. యెప్పుడైనా యిల్లు కొనుక్కుంటే అప్పుడు వేసుకోవచ్చు'' నాన్నగారు దిగులుగా అనేవారు. ఆమెకో చిన్ని కలని, ఆశని యిస్తుండేవారు.

''పోన్లెండి. యెన్నాళ్ళు యే యింట్లో వుంటే అంతే ప్రాప్తం అనుకుంటా. ఆ యింట్లోకి వచ్చినవాళ్ళు సంతోషిస్తారు. మొక్కలంటే యెవరికి యిష్టం వుండదు. వాళ్ళే పెంచుకుంటారు.''

ఆరోజు కాలేజీ నుంచి యింటి కొచ్చేసరికి అమ్మ కళ్ళు యెర్రగా వాచిపోయి, వుబ్బిపోయాయి.

''యేమయిందమ్మా...''

అమ్మ కళ్ళ నిండుగా నీళ్ళు.

యిందాక మన మొదటింటి వైపు వెళ్ళాను. వొక్క మొక్కా లేదు. ఆ యింటిని పెద్దది చేస్తున్నారంట. మరో మూడు పోర్షన్లు వేస్తారంట. ఆ మొక్కలన్నింటిని... ప్చ్... కళ్ళల్లో నీరు ధారగా బుగ్గలపై.

వేళ్ళతో సహా మొక్కల్ని పెకలించటాన్ని తలుచుకొని తలుచుకొని అమ్మ బాధ పడుతూనే వుంది.

సొంత యిల్లు లేకపోవటం వల్లే కదా యీ బాధ అనిపించింది.

అప్పట్నుంచి అమ్మ మొక్కలు వేయటం తగ్గించేసింది. వాటి మీద ఆపేక్షని మొత్తంగా వదులుకోలేకపోయింది. కూరగాయల్ని, ఆకుకూరల్ని వేస్తుండేది. రానురాను కాస్త పెరడు వాకిలి వున్న యిళ్ళూ అద్దెకి దొరకటం అరుదైపోయింది. కాస్తంత జాగా వున్న వో పోర్షన్‌తో సర్దుకోవటమే.

అమ్మ సంతోషాన్ని బలవంతంగా లాక్కున్నదెవరు...

అమ్మ దుఃఖం నన్ను మెలిపెడుతూనే వుంది.

యూనివర్శిటీలో జాయిన్ అయిన కొత్తలోనే నాన్నగారి నుంచి ఫోన్ వచ్చింది. హైదరాబాద్‌లో పెద్ద వుద్యోగం వచ్చిందని.

అంత దూరం వెళ్ళిపోతారా! అని అమ్మమ్మ, నాన్నమ్మ, తాతగార్లు బోల్డంత

బెంగపడుతున్నారట. చెల్లాయి, తమ్ముడు వెళుతున్నామనే వుత్సాహంలో వున్నారట. యెప్పటిలాగే అమ్మ యేం అనలేదట. వీలు చూసుకుని హైదరాబాద్ రా... మణి పెద్దమ్మగారింటికి వెళుతున్నావా... జాగ్రత్తగా వుండు. బాగా చదువుకో ఆఁ... నీకు ఆ విషయం చెప్పక్కర్లేదనుకో... యిదిగో అమ్మ మాట్లాడుతుంది... అని అమ్మకి రిసీవర్ యిచ్చారు.

"వేళకి తింటున్నావా... నీకు చాలా దూరం అవుతుంది. రాత్రంతా ప్రయాణం చెయ్యాలట, నువ్వు అక్కడికి రావాలంటే. పెద్దమ్మగారింట్లో అడిగానని చెప్పు. తమ్ముడు, చెల్లాయిలు బాగున్నారు. నీ ఆరోగ్యం జాగ్రత్త. అమ్మమ్మ జున్ను పంపించింది. నీకిష్టం కదా. యెంత గుర్తొచ్చావో. ఆఁ నందూ... డబ్బులేమైనా అర్జంటుగా కావాలిస్తే పెద్దమ్మగారి దగ్గర తీసుకో. తనకి నేను వుత్తరం రాస్తాను. జాగ్రత్త..."

వాళ్ళు అంత దూరం వెళ్ళిపోతున్నారంటే బెంగొచ్చేసింది. యిప్పుడైతే యిలా ట్రైన్ యెక్కితే అలా స్టేషన్‌లో దిగిపోతాం. యిప్పుడు అదో పెద్ద ప్రయాణం. హాస్టల్లో వుండాలనిపించలేదు. యెల్లుండి యెలాగూ ఆదివారమే. రేపుదయం పెద్దమ్మగారింటి నుంచి క్లాసుకి వస్తే సరిపోతుంది. పెద్దమ్మగారింటికి వెళ్ళాను.

అమ్మకి మేనబావ భార్య ఆమె. అమ్మకి మణి పెద్దమ్మగారి మధ్య స్నేహం యెక్కువ. వాత్సల్యంగా వుంటారిద్దరూ. ఆమెకి విషయం చెప్పాను. 'యెక్కడుంటేనేంటమ్మా బాగుండాలంతే...' అంటూ ఆమె పిల్లల గురించి చెపుతూ కాఫీ చేసి యిచ్చింది. "ఆదివారం వనభోజనాలు. వూర్లో వున్న బంధువులంతా వస్తారు. నీకు కబురు పెడదాం అనుకుంటున్నా... మంచిది, వేళకి వచ్చావ్" అన్నారామె.

ఆదివారం వుసిరిచెట్టు కింద వనభోజనాలు. ఆటలు, పాటలు, కబుర్లు, వంటలు యెప్పుడూ చూడని బంధువులు చాలామంది కనిపించారు. అందర్నీ పెద్దమ్మ పరిచయం చేస్తూనే వుంది. కొంతమంది పిల్లలకి సంబంధాలని గుసగుసలా వెతుక్కోవటం వినిపించింది.

యీ అబ్బాయి ఆ అబ్బాయి అంటూ పెద్దమ్మ నాకసలు పరిచయం లేని బంధువుల పిల్లల్ని పరిచయం చేస్తోంది.

"మీ యూనివర్శిటీలోనే రవి, సైన్స్ స్టూడెంట్," అంది.

“హాస్టల్లో వుంటున్నారా,” అడిగాడు.

“ఆఁ”

“యెం.ఎస్సీ అయిపోయింది. రీసెర్చి చేస్తున్నా.”

“వూఁ”

“ఫస్ట్ యియరా”

“ఆ”

యింతలో పెద్దమ్మ మరెవరినో పరిచయం చేసింది.

కార్తీకపు సాయంకాలపు చలిగాలులు గిలిగింతలు పెడుతుంటే... యింట్లోకి వెళ్ళటానికి సామాను సర్దుతుంటే రవి వచ్చి మెల్లగా అన్నాడు “యూనివర్శిటీలో కలుస్తా. సీయూ బై.”

సోమవారం వుదయం పెద్దమ్మగారింటి నుంచి నేరుగా యూనివర్శిటీకి వెళ్ళిపోయాను.

వనభోజనాలకి వెళ్ళొచ్చిన నాలుగురోజులకి పెద్దమ్మగారి నుంచి యింటికి రమ్మని కబురు.

“నిన్ను వనభోజనాలకి తీసుకెళ్ళినందుకు ఫలితం దక్కిందనుకో. వొకటీ రెండూ కాదు. నాలుగు సంబంధాలొచ్చాయి. అన్నీ భేష్‌గా వున్నాయి. నీకేం కుందనపు బొమ్మలా వుంటావ్. ముందు నీకు దిష్టి తీయాలి...” పెద్దమ్మ ధారగా చెప్పుకు పోతోంది.

“పెళ్ళి సంబంధాల కోసం పట్టుకెళ్ళారా”

“యిలాంటివి సంబంధాల కోసమే కదా....” అంటూ ఆవిడ వాళ్ళ వివరాలు చెప్పుకుపోతోంది.

వాళ్ళలో వొక్క కుర్రాడూ గుర్తు రావటంలేదు.

“మీ అమ్మని రమ్మంటాను. జాతకాలు కలిసిందేదో చూసి సెటిల్ చేసుకో వచ్చు” పెద్దమ్మగారు చెప్పుకుపోతున్నారు.

యీ జాతకాలు, దిష్టి తీయించుకోవడాలు... ఆవిడకు చాలా పట్టింపు.

అవేం వద్దంటే... అలా మాట్లాడినందుకు తాయత్తు కట్టిస్తానంటుంది.

అప్పుడే పెళ్ళా...

అమ్మ కళ్ళలో మెరుపు జ్ఞాపకాల్లోంచి...

పెద్దమ్మగారితో అవన్నీ మాట్లాడటం యెందుకు. మాట్లాడాల్సిన వాళ్ళు వేరే కదా. కుర్రాడితో కదా. యే వొక్క ముఖం గుర్తుకు రావటంలేదు. పెద్దమ్మగారు చెప్పిన వాళ్ళలో రవి లేడు. రవి వొక్కడే కాస్త గుర్తున్నాడు. నాలుగు మాటలు మాట్లాడాడుగా.

"అమ్మతో మాట్లాడాక అమ్మ వస్తుంది కదా! ఆ నాలుగురోజులు నువ్విక్కడే వుండు" అన్నారు పెద్దమ్మ.

రెండ్రోజుల తర్వాత క్లాసు అయ్యాక దారికి అటూ యిటూ బఠాణీ తీగలు దట్టంగా అల్లుకున్న సన్నని కాలిబాట నుంచి క్యాంటీన్ వైపు వెళుతుంటే.... "నందనా" అంటూ నవ్వుతూ యెదురొచ్చాడు రవి.

"క్యాంటీన్‌కా"

"ఆఁ"

"అలా డౌన్‌కి వెళదామా"

"సముద్రం వైపుకా"

"ఆఁ" అంటూ నవ్వుతూ...

"మీ ఆఁ వూఁలు నాకొచ్చేస్తున్నాయి" అన్నాడు.

యిద్దరం సముద్రం వైపు నడుస్తున్నాం. అప్పలకొండ టీ బండి నుంచి వన్ బై టూ టీ తీసుకొచ్చాడు.

విశాలమైన సముద్రంలో అక్కడో నౌక యిక్కడో నౌక బొమ్మల్లా కనిపిస్తు న్నాయి.

కాసేపు యూనివర్శిటీ ప్రొఫెసర్‌ల క్లాసులు, హాస్టల్ విషయాలు మాట్లాడుతూ "మీరు మరోలా అనుకోనంటే మీతో వో విషయం మాట్లాడాలనుకుంటున్నా"

''ఊ''

''నేనింత త్వరగా యీ విషయం మాట్లాడాల్సివస్తుందనే అనుకోలేదు. పరిస్థితులు అలా వచ్చాయి. వనభోజనాలప్పుడు మిమ్మల్ని చూశానా... చూడగానే నచ్చారు. ఆ విషయాన్ని నాలోనే దాచుకున్నా. ఆ మర్నాడు సాయంత్రం మీ ప్రస్తావన అమ్మ తీసుకొచ్చింది. తనకీ మీరు నచ్చారు. మీరు నాకు నచ్చారో, లేదో చెప్పమంది. కాస్త టైమ్ కావాలన్నాను. మీతో మాట్లాడాలి. మీరేం అనుకుంటున్నారో తెలుసుకోవాలి. అప్పుడు చెపితే మీ పెద్దాళ్ళతో మాట్లాడొచ్చు. మీ ప్లాన్స్ తెలియకుండా మిమ్మల్ని యిబ్బంది పెట్టాలనిపించలేదు.''

పెద్దమ్మ చెప్పిన సంబంధాలలో రవి యిందుకని లేడన్నమాట.

యెంచక్కా నవ్వాడు కదా లిస్ట్‌లో లేడేంటి అనుకున్నా.

''మీకింత త్వరగా చెప్పాల్సిన పరిస్థితిని తెచ్చిందీ మీరే.''

''నేనా''

''మీకోసం చాలామంది లైన్‌లో వున్నారని అమ్మకి తెలిసిందిట. 'త్వరగా విషయం చెప్పు. వాళ్ళతో మాట్లాడతా' అంది. నాకో చెల్లెలు. ఆరోజు చూశారుగా. వసపిట్ట. నాన్నగారు లెక్చరర్. పాండురంగపురంలో యిల్లు కట్టారు. అందులోనే వుంటున్నాం. అమ్మని, నాన్నగారిని చూశారుగా. నా చదువు తెలుసు. అమెరికా వెళ్ళాలని లేదు. యిండియాపై ప్రేమ అనుకోవచ్చు. కానీ అసలు నా ప్రేమంతా యీ సముద్రంపైన. యింత అందమైన తీరమున్న పట్టణం లేదు. యింత అందమైన సముద్రమూ లేదు. చాలా యిష్టం. వదల్లేను. వుద్యోగం కూడా యిక్కడే చేస్తాను'' అన్నాడు.

యేం చెప్పాలి...?

యెదురుగా వున్న సముద్రమంతా వో పచ్చని కెరటంలా లేస్తోంది.

యీ పచ్చదనం నా మనసులోనిది.

''నందనా! టైమ్ కావలిస్తే తీసుకోండి. యిష్టం లేకపోయినా యిబ్బంది పడకండి.''

''కాస్త టైమ్ కావాలి''

అతను చిన్నగా నవ్వి, "మీకు కావల్సినంత తీసుకోండి. కానీ ఆలోచించండి" అన్నాడు.

రవితో మాట్లాడాలి. నేను చెప్పబోయే విషయాన్ని అర్థం చేసుకునే కుర్రాడిలాగే వున్నాడు. పెళ్ళికి నా అభిప్రాయం ముఖ్యమని అనుకున్నాడుగా. ఆ మిగిలిన వాళ్ళతో మాట్లాడే అవకాశం కూడా కనిపించటం లేదు. అదీగాక రవి మాటలో, నవ్వులో లాక్కునే లక్షణమేదో వుంది. యేమున్నా కూడా ముందు నేను చెప్ప బోయే విషయాన్ని వాళ్ళు యెలా తీసుకుంటారన్న దానిమీదే సహచరుడి యెంపిక.

అవుట్ గేట్ దగ్గర రవి కనిపించాడు.

యిద్దరం అప్పలకొండ టీ బండి దగ్గరకి వెళ్ళాం. వన్ బై టూ టీ.

సాయంకాలపు వెలుగులో నీలంగా మెరుస్తోంది సముద్రం.

"అమ్మా వాళ్ళ విషయాలు తెలుసుగా. నా విషయం చెపుతా. వుద్యోగం చేస్తా. సగం జీతం మాత్రమే యింటికి యిస్తా. మిగిలిన సగం సేవింగ్స్. ఆ సేవింగ్స్ యెప్పటికీ మన యింటికోసం ఖర్చు చేయను" అన్నాను.

"యిందులో నేను కాదనటానికేముంది?"

"యేమో... నాకూ తెలియదు. నా భయాలు నావి. వో పదేళ్ళ తర్వాత ఆ డబ్బు కావాలనిపించినా యివ్వను."

"మొత్తం దాచుకో. నా జీతం వుంటుందిగా!"

"అది న్యాయం కాదు. సగం చాలు. ఆ డబ్బులు యెందుకంటే, మా అమ్మకో యిల్లు కొనిద్దామని."

రవి క్షణకాలం నావైపు చూసి నవ్వాడు చిన్నగా. ఆ నవ్వులో ప్రశంస నిండుగా వుంది.

యిద్దరం తిరిగొస్తుంటే పాండురంగపురంవైపు రాగానే, "అదే మా యిల్లు" అని చూపించాడు.

"నీ బండెక్కడో వుంచి నాతోపాటు నడవాల్సి వస్తోందిగా" అన్నాను.

''బండెక్కుతావో, లేదో తెలియదు కదా...''

దేవి గుడి ముందుకొచ్చాక ''నేను వెళ్ళనా'' అడిగాను.

''మీ హాస్టల్ వచ్చేస్తుంది కదా''

''ఆఁ''

రెండ్రోజుల తర్వాత పెద్దమ్మ హడావిడిగా ఫోన్ చేసి 'త్వరగా రా' అంది.

చిక్కని కాఫీ ఇస్తూ, 'నీకింకో సంబంధం వచ్చింది. ఆరోజు నీతో మాట్లాడాడు చూడు రవీ అని... వాళ్ళకి నచ్చావట. యేదో విషయం చెప్పు'' అన్నారామె.

''రవి విషయం మాట్లాడు''

పెద్దమ్మ ఆశ్చర్యంగా చూసి ''అమ్మదొంగా'' అంది నవ్వేస్తూ.

పదిరోజుల తర్వాత యింటికి వెళుతున్నట్టు రవికి చెప్పాను.

గోదావరి ఎక్స్‌ప్రెస్ కంపార్ట్‌మెంట్‌లోకి యెక్కి బర్త్ కింద సూట్‌కేస్ పెట్టి పైకి లేవబోతుంటే, ''తిరిగి యెప్పుడొస్తావ్'' అన్నాడు రవి.

''నీకెలా తెలుసు నేనీరోజు వెళుతున్నానని''

''పదిరోజుల తర్వాత అన్నావు కదా''

''వూఁ హ''

''త్వరగా రా. ఫోన్ చేయనా''

''వూఁ''

నెంబర్ యిచ్చాను.

''త్వరత్వరగా వచ్చెయ్'' అతనలా బెంగపడుతుంటే బెంగేసింది.

ట్రైన్ కదలబోతుంటే అరిటాకులో చుట్టిన సింహాచలం సంపెంగ పూలమాల యిచ్చాడు.

ఆ పరిమళమంటే నాకెంతో యిష్టం.

"త్వరగా వచ్చేస్తా" చెప్పాను.

అతను నవ్వాడు తేటగా.

చారెడు మట్టి కూడా లేని అపార్ట్‌మెంట్ జీవితంలో అమ్మ గులాబీలను, రేక మందారాలను, మనీప్లాంట్‌ను కుండీల్లో పెంచుతోంది.

అమ్మకి సంపెంగ పువ్వులని చూపించి వుసిరిచెట్టు ప్రేమకథ చెప్పాను. అమ్మ చుట్టరికాలు తిరగేసి "మంచి కుటుంబం" అంది.

"యెంత కట్నం అడుగుతారో. పెద్ద జీతమనే మాటే కానీ, సిటీలో యెంతొచ్చినా సరిపోదు. అంతా చదువుల్లో వున్నారు. యీ చదువులకి, యింటి అద్దెలకి యెంతొచ్చినా సరిపోదనుకో. అయినా పెళ్ళిళ్ళు చేయమనలేం కదా. మంచి సంబంధం. యేదో వొక లోన్ తీసుకుని చెయ్యాలి" అంది అమ్మ.

"వాళ్ళని కట్నం అడక్కుండా వొప్పించొచ్చు. కానీ యే రిజిష్టర్ పెళ్ళికో వొప్పించ లేను. అలా వొప్పుకున్నా రిసెప్షన్ తప్పదు. రవితో మాట్లాడాలి. వాళ్ళింట్లో యేమం టారో తెలియదు. వాళ్ళు యెలా చదువుతున్నారు" అడిగాను.

"పెద్ద చెల్లెలు ఫర్వాలేదు. చిన్నదానితోనే తిప్పలు. చదువుతుంది కానీ డిమాండ్స్‌ని తీర్చలేం. ఫ్రెండ్స్ యెక్కువ. యేమయినా అంటే గట్టిగా అరుస్తుంది. చిన్నా చదువుతున్నాడు కానీ వాడికో లైన్ మీద యింట్రెస్ట్ అంటూ లేదు" అంది అమ్మ.

పెద్దమ్మకి యివ్వమని అమ్మ పుల్లారెడ్డి జీడిపప్పు పాకం యిచ్చింది.

✦

రవి చిన్నపాపకి కథ చెపుతూ నిద్రపుచ్చుతున్నాడు.

నిద్రపోయిన చిన్నపాపని మంచంపై పడుకోబెట్టాను. గది బాల్కనీలోకి సముద్రం లో నౌకలు మిలమిలా మెరుస్తూ కనిపిస్తున్నాయి. సముద్రపు హోరు కొబ్బరాకుల సవ్వడితో సమ్మిళితమై వినిపిస్తోంది.

"పదేళ్ళ వరకు డబ్బు సేవ్ చేసి యిల్లు కొనటం యెందుకు? యిప్పుడే కాస్త లోన్ తీసి కొనొచ్చు కదా. ఆ సేవింగ్స్‌తో లోన్ పే చేసెయ్యొచ్చు" అన్నాడు రవి.

"ముందు ముందు లాండ్ వాల్యూ బాగా పెరిగిపోతుంది. అప్పుడెప్పుడో కొని కట్టటం కంటే యిప్పుడే మొదలుపెడితే వాళ్ళకీ ఆ అద్దె బాధ తప్పుతుంది.మీ అమ్మగారికి అప్పుడంత వోపిక వుండొద్దా మొక్కల్ని పెంచటానికి. యిప్పుడు కొని కట్టిస్తే వాళ్ళకి ఆ యింటిని యెంజాయ్ చేసినట్టుంటుంది" అన్నాడు రవి.

సరే, యింతకీ వాళ్ళకి స్థలం యే వూర్లో కొనాలి.

ఆ పల్లెకి వెళ్ళి వుండటం వుద్యోగాల వల్ల కుదరదు. మీ నాన్నగారు రిటైర్ అవ్వటానికి యింకా చాలా టైమ్ వుంది. యిప్పుడు యిల్లు యెక్కడో కొనలేం. ఆ సిటీలోనే కొనాలి. వాళ్ళని వోసారి అడుగు" అన్నాడు రవి.

నేను యిల్లు కొనటానికే వాళ్ళు ముందు వొప్పుకోలేదు. వాళ్ళని వొప్పించటానికి వో వారం పట్టింది రవికి.

"మీరిద్దరే అంటున్నారు. మిగిలిన యిద్దరల్లుళ్ళూ యిక్కడే వున్నారు. చిన్నా కూడా యిక్కడే వుద్యోగం వెతుక్కుంటున్నాడు. యిక్కడే యిల్లు కట్టుకుంటే పిల్లలతో వున్నట్టుంటుంది" అని నాన్నగారు అన్నారు.

"సిటీ గురించి మీకే బాగా తెలుసు. వో స్థలం చూసుకుని బేరం చేసి పెట్టండి. డబ్బులు పంపిస్తా" చెప్పాను.

"సిటీ మధ్యలో మన వల్లకాదు. కాస్త అవుట్‌స్కట్స్‌లోనే చూడాలి" అన్నాడు చిన్నా.

"ఆ అవుట్‌స్కట్స్‌లోనా... దొంగలు బాబూ. అన్నిటికీ దూరం" అంది పెద్ద చెల్లెలు.

"నీకిదేం చాదస్తమక్కా... సిటీ మధ్యలో యెంచక్కా అపార్ట్‌మెంట్ కొనుక్కుంటే సేఫ్. సెక్యూరిటీ వుంటుంది. వూరవతల యిల్లేంటే..." చిన్న చెల్లెలు అనేసింది.

"అపార్ట్‌మెంట్ వద్దు. నేల, మట్టి వున్న యిల్లే కావాలి" చెప్పాను.

"సరే వెతుకుదాం" అన్నాడు చిన్నా.

చిన్నా వో రెండు నెలలు వెతికి, "మనకి కావల్సిన ప్లాట్ దొరికింది. యిప్పుడిప్పుడే యిళ్ళు వస్తున్నాయి. చాలా బాగుంది. అమ్మకి నాన్నగారికి నచ్చింది. నువ్వొచ్చి చూస్తావా" అడిగాడు.

"యిప్పుడు వీలుకాదురా. పిల్లలకి పరీక్షలు. ఆఫీసులో కూడా చాలా పనుంది. మీ అందరికీ నచ్చితే చాలు."

"ఆ సైట్‌కి బాగా డిమాండే వుందక్కా. త్వరగా తేల్చుకోవాలి. నచ్చితే ముందు అడ్వాన్స్ యివ్వాలి. యెప్పట్లోగా మొత్తం యివ్వగలమో చెప్పాలి" అన్నాడు చిన్నా.

ప్లాట్‌కి యెంత అవుతుందో అడిగి, ఆ వివరాలన్నీ నోట్ చేసుకున్నా.

రవికి చెప్పాను. "అడ్వాన్స్ పంపించేద్దాం. యిల్లు కట్టడానికి లోన్ తీసుకుందాం" అన్నాడు.

"అడ్వాన్స్ పంపి, మిగిలింది రిజిస్ట్రేషనప్పుడు యిద్దామని చెపుతాను" అన్నాను.

అడ్వాన్స్ పంపించాను.

చిన్ని యిల్లు కట్టుకుని చుట్టూ విశాలమైన ఆవరణలో అమ్మ మొక్కలు పెంచుకోవచ్చని నాన్నగారెంతో సరదాపడ్డారు. "బాధ్యతలతో మీ అమ్మకి చారెడు మట్టి వున్న యిల్లు యివ్వలేకపోయాను. పోనీలే, నీ వల్లనైనా మీ అమ్మ సంతోషిస్తుంది" అన్నారు.

మంచిరోజు చూసి రిజిస్ట్రేషన్ చెపుతాను. అప్పటికి నువ్వు వస్తే బాగుంటుందన్నాడు చిన్నా.

అడ్వాన్స్ పంపిన నెలకైనా రిజిస్ట్రేషన్ వూసెత్తడు చిన్నా.

'యెప్పుడు రా'... అంటే 'వచ్చె'యన్నాడు. మిగిలిన డబ్బు యెరేంజ్ చేసుకొచ్చా.

యెంతకీ రిజిస్ట్రేషన్ ఆఫీసు దగ్గరకి రాలేదు. పేపర్స్ తీసుకుని ప్లాట్ వోనరుతో వస్తానన్న మనిషి రాలేదేంటి. లాయర్ వోపీనియన్ కూడా అయిందన్నాడు. యి.సి. తీయించానన్నాడు. డాక్యుమెంట్ అన్నీ పర్‌ఫెక్ట్‌గా వున్నాయన్నాడు. యేవయింది... చిన్నా యెలా వున్నాడు. ఆ వోనర్ దొరకలేదా. యే విషయం చెప్పడానికైనా రావాలిగా. నేనిక్కడ యెదురు చూస్తున్నానని తెలుసుగా.

అమ్మకి ఫోన్ చేస్తే తమ్ముడింకా యింటికి రాలేదంది.

ఆఫీసు మూసేవేళ వరకు చూసి యింటికి బయలుదేరాను. యింట్లో అందరికీ చిన్నాకి యేమయిందోననే కంగారులో వుండగా, పదకొండుగంటలప్పుడు వచ్చాడు.

"అప్పటికప్పుడు యింటర్వ్యూకి వెళ్ళాల్సి వచ్చింది. రేపు చేయిద్దాం" అన్నాడు.

"రేపు మంచిరోజు కాదురా" అంది అమ్మ.

"పోనీ, రెండ్రోజులు ఆగుదాం"

"అక్కకి సెలవు లేదు"

"యిల్లు నీ పేరు మీద కదమ్మా. అక్క లేకపోయినా చేయించొచ్చు" అన్నాడు.

"ఆ పేపర్లు అక్క మీ అమ్మ చేతిలో పెడితే బాగుంటుందిరా" అన్నారు నాన్న.

"అక్కకి యెప్పుడు వీలైతే అప్పుడు చేయిద్దాం. ఆ స్థలం యెక్కడికీ పోదు. అడ్వాన్స్ యిచ్చాంగా" అన్నాడు చిన్నా.

"యెవరికి యిచ్చావ్" అడిగాను.

"వోనర్‌కి"

"చిన్నా! యింక యీ డ్రామాలొద్దు. నిజం చెప్పు. డబ్బులు యెవరికి యిచ్చావ్" అడిగాను.

"వోనర్‌కి"

"నీ వరసేదో చాలా తేడాగా వుంది. చెప్పు... డబ్బులేం చేశావ్"

చిన్నా వెక్కివెక్కి యేడవటం మొదలుపెట్టాడు.

"చెప్పరా యేమయిందో. యిద్దరం కలిసే యేడుద్దాం" అన్నాను.

"యెక్కడా వుద్యోగం రావటంలేదు. డబ్బిస్తే అమెరికా పంపిస్తానంటే యిచ్చాను. వాడు... యివాళ... రేపు... అంటున్నాడు. పేపర్స్ యివ్వటంలేదు. వాడు... వాడు... పారిపోయాడని తెలిసింది. అమెరికా వెళ్ళి నీకీ విషయం చెపుదాం అనుకున్నా. ఏ యేడాదిలో బాగా సంపాదించి సిటీ మధ్యలోనే యిల్లు కొందామనుకున్నా అమ్మకి. ముందే చెపితే మీరు వొప్పుకోరని చెప్పలేదు. వాడు పారిపోయాడు. మోసం చెయ్యాలని నాకు లేదు. యిలా అయిపోయింది. వుద్యోగం లేక డిప్రెషన్ వచ్చేస్తుంటే డెసిపరేట్‌గా చేశా..." వెక్కుతూవెక్కుతూ చెపుతున్నాడు.

"పోనీలేరా చిన్నా... యేడవకు" నాన్న, అమ్మ వాడిని వోదారుస్తున్నారు.

ఆకుపచ్చ జ్ఞాపకం... భళ్ళుమని పొంగుకొస్తున్న నా దుఃఖాన్ని యెవరు వోదార్చ గలరు. తిరిగి అన్ని లక్షలు యెలా పోగేస్తా... సుళ్ళుసుళ్ళుగా దుఃఖం తిరుగు తుంటే... భుజం మీద మెత్తని చేయి అమ్మది.

"మనసు కష్టపెట్టుకోకు... చిన్నాడు... యేదో ఆశపడ్డాడు..." అమ్మ అంది.

చిన్నా భుజం మీద చేయి వేశాను.

"అక్కా! సారీ..." వెక్కుతున్నాడు.

తిరిగి ఆకుపచ్చ జ్ఞాపకాన్ని వెతుక్కుంటూ... నెరవేర్చాలనే ఆకాంక్షతో...



కథాపత్రిక